శనివారం 31-08-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 441 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలి

మిగతా 2లో



పేదలకు గూడు లేకుండా చేస్తున్నారు

మిగతా 2లో



చరిత్ర సృష్టించిన అవనీ లేఖరా

మిగతా 3లో




టీలో కల్తీని గుర్తించటం ఎలా

మిగతా 5లో

# ఇకపై పాకిస్తాన్‌తో చర్చలు లేవు

## చర్యకు ఇక ప్రతిచర్య ఉంటుంది

- సమయాన్ని బట్టి తగిన విధంగా బదులిస్తాం
- కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్ కీలక వ్యాఖ్యలు



ముందడుగు జాతీయం: పాకిస్తాన్‌తో చర్చలు జరిపే కాలం ముగిసిందని, ఇక మీదట సానుకూలమైనా ప్రతికూలమైనా పాక్ నుంచి వచ్చే చర్యకు తప్పకుండా ప్రతిచర్య ఉంటుందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్.. పాకిస్థాన్ అంశాన్ని ప్రస్తావించారు. పాకిస్థాన్ మనతో ఎలా వ్యవహరిస్తే.. మనమూ అందుకు తగిన విధంగా బదులిస్తామని స్పష్టం చేశారు. 'పాకిస్థాన్‌తో పదే పదే చర్చలు జరిపే కాలం ముగిసింది. మన దేశం పట్ల పాకిస్థాన్ ఎలా వ్యవహరిస్తే.. మనం కూడా అందుకు తగిన విధంగా బదులిస్తాం.

పాక్ నుంచి వచ్చే చర్య సానుకూలమైనా ప్రతికూలమైనా తప్పకుండా ప్రతిచర్య ఉంటుంది. పరిస్థితులకు అనుగుణంగా భారత్ ముందడుగు వేస్తుంది' అని జై శంకర్ స్పష్టం చేశారు. ఇదే కార్యక్రమంలో ఉగ్రవాద కార్యకలాపాలపై కూడా జైశంకర్ స్పందించారు. పాకిస్థాన్ చేపడుతున్న ఉగ్రవాద చర్యలకు తగిన పరిణామాలు ఉంటాయని తీవ్రంగా హెచ్చరించారు. ఇటీవలే జమ్మూ లోయలో వరుసగా జరుగుతున్న ఉగ్రదాడులతో రెండు దేశాల మధ్య సత్సంబంధాలు అస్థిరంగా మారాయన్నారు.

ప్రధాని మోదీ ఈ విషయంలో వెనక్కి తగ్గరని స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు ఓ ముగిసిన కథ అని జైశంకర్ పేర్కొన్నారు. పొరుగు దేశం బంగ్లాలోని పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు జై శంకర్ వెల్లడించారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సమయానుగుణంగా వ్యవహరిస్తామని తెలిపారు. పొరుగుదేశాలతో సమస్యలు ఉండని దేశమంటూ ఏదీ లేదని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. దేశాల మధ్య పరస్పర సహాయ, సహకారాలు అందించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కొత్తగా ఏర్పాటైన బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం కూడా భారత్‌తో సత్సంబంధాలు కలిగి ఉంటుందని జై శంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మోడీజీ మీ నుంచి సమాధానం రాలే

## మరో లేఖ రాసిన మమతా బెనర్జీ




ముందడుగు పశ్చిమబెంగాల్: పశ్చిమబెంగాల్‌లోని జూనియర్ వైద్యురాలిపై అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నేపథ్యంలో సీఎం మమతా బెనర్జీ ప్రధాని నరేంద్ర మోడీకి మరో లేఖ రాశారు. అత్యాచార ఘటనలకు పాల్పడేవారిని శిక్షించేందుకు కఠినచట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే నిర్దిష్ట కాలపరిమితిలో కేసుల్ని పరిష్కరించేలా ఆ చట్టం ఉండాలని మరోసారి తన లేఖలో అభ్యర్థించారు. "ఈ సున్నిత అంశంపై మీనుంచి ఎలాంటి సమాధానం అందలేదు" అని పేర్కొన్నారు. తాను రాసిన లేఖపై ప్రధాని నుంచి నేరుగా సమాధానం రాకపోవడంపై విచారం వ్యక్తంచేశారు. మహిళా శిశుసంక్షేమశాఖ నుంచి బదులు వచ్చిందని చెప్పిన ఆమె.. సమస్య తీవ్రత దృష్ట్యా ఆ సాధారణ సమాధానం సరిపోదన్నారు. అత్యాచార ఘటనపై వారం రోజుల క్రితం మోడీకి దీదీ తొలిసారి లేఖ రాశారు. "దేశంలో మహిళలపై జరుగుతోన్న అత్యాచార ఘటనలను మీ దృష్టికి తీసుకురావాలనుకొంటున్నా.

మిగతా 2లో

# నా తలవంచి క్షమాపణలు చెపుతున్నా


## శివాజీ విగ్రహం కూలడంపై తీవ్ర వేదనకు గురయ్యా

### మహారాష్ట్ర పర్యటనలో ప్రధాని మోడీ



ముందడుగు మహారాష్ట్ర: మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కూలిన ఘటనపై తాజాగా ప్రధాని మోడీ క్షమాపణలు తెలియజేశారు. "నేను ఇక్కడ దిగిన వెంటనే.. విగ్రహం కూలడంపై శివాజీకి క్షమాపణలు చెప్పాను. ఈ ఘటన వల్ల బాధకు గురైన వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను" అని వెల్లడించారు.

మిగతా 2లో




# ఏటీఎం కార్డులు అవసరం లేదు

- నవ్వితే డబ్బులు వస్తాయి..!
- స్మైల్‌పే అనే ఒక కొత్త పేమెంట్ మెథడ్
- కస్టమర్ ముఖాన్ని చూసి పేమెంట్ పూర్తి చేస్తోంది

04

ముందడుగు
శనివారం, 31-08-2024, హైదరాబాద్

# యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం
- పర్యాటక అభివృద్ధికి నూతన విధానం
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

ముందడుగు తెలంగాణ:
తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి నూతన విధానం రూపొందించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. 'స్పీడ్' ప్రాజెక్టులపై సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఎకో, టెంపుల్ పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హెల్త్ టూరిజంను అభివృద్ధి చేయాలని చెప్పారు. హైదరాబాద్ బయట మరో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

యాదగిరిగుట్ట అభివృద్ధిపై అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. తితిదే బోర్డు మాదిరే యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధిలో పెండింగ్ పనుల వివరాలు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టాల్సిన చర్యలపై వివరాలు ఇవ్వాలని సూచించారు.



ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులు వేగవంతం చేయాలన్నారు. ఆలయ అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆపవద్దని స్పష్టం చేశారు. వైటీడీఏ, యాదగిరిగుట్టకు సంబంధించి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతి కుమారి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ రమేష్‌రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# మోడీజీ మీ నుంచి సమాధానం రాలే

(మొదటిపేజీ తరువాయి)
అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. దేశవ్యాప్తంగా రోజుకు దాదాపు 90 అత్యాచార ఘటనలు జరుగుతుండటం భయానక పరిస్థితిని సూచిస్తోంది. ఇలాంటి చర్యలు సమాజం, దేశం విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ఈ దురాగతాలకు ముగింపు పలకడం ద్వారా మహిళలు తాము సురక్షితంగా, భద్రంగా ఉన్నామని భావించేలా చేయడం మనందరి కర్తవ్యం. ఘోరమైన నేరాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించేలా చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. సత్వర న్యాయం జరగాలంటే ఈ కేసుల విచారణ 15 రోజుల్లో పూర్తి చేయాలి'' అని పేర్కొన్నారు.

# నా తలవంచి క్షమాపణలు చెపుతున్నా

(మొదటిపేజీ తరువాయి)
''ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను తమ దైవంగా భావించేవారు ఈ ఘటనతో తీవ్ర వేదనకు గురయ్యారు. నా తలవంచి వారికి క్షమాపణలు చెబుతున్నా. మనకు ఈ దైవం కంటే గొప్పది ఏమీ లేదు'' అని మోడీ మాట్లాడారు. ఈ రోజు మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో పర్యటించిన సందర్భంగా ఆయన ఈ విధంగా స్పందించారు.

ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కొద్దిరోజుల క్రితం కుప్పకూలిపోయింది. 35 అడుగుల ఎత్తున్న ఈ విగ్రహాన్ని గతేడాది డిసెంబరు 4న నౌకాదళ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి మోదీ ఆవిష్కరించారు. రాష్ట్రంలో కురిసిన వర్షా ల కారణంగానే విగ్రహం కూలినట్లు భావిస్తున్నామని, అసలు కారణాన్ని నిపుణులు త్వరలోనే వెల్లడిస్తారని అధికారులు తెలిపారు. కాగా, తొమ్మిది నెలలు కూడా పూర్తికాకుండానే విగ్రహం కూలిపోవడం పట్ల ప్రతిపక్షాలు మండిపడ్డాయి. రాష్ట్రప్రభుత్వానికి ప్రచారం మీద ఉన్న దృష్టి, నాణ్యత మీద లేదని దుయ్యబట్టాయి.

# తాను 12 సార్లు సివిల్స్ రాశాను

- ఏడు ప్రయత్నాలు పరిగణలోకి తీసుకోవద్దు
- కోర్టుకు తెలిపిన ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్

ముందడుగు జాతీయం:
ట్రైనీ ఐఏఎస్ ఆఫీసర్ పూజా ఖేద్కర్ కోర్టుకు కొన్ని అంశాలను వెల్లడించింది. తాను 12 సార్లు సివిల్స్ పరీక్ష రాసినట్లు ఆమె చెప్పారు. కానీ దాంట్లో ఏడు ప్రయత్నాలను పరిగణలోకి తీసుకోరాదు అని ఆమె కోర్టుకు విన్నవించారు. ఏసీఎల్(యాంటీరియర్ క్రూసియేట్ లిగామెంట్)తో బాధపడుతున్నట్లు మహారాష్ట్ర ఆస్పత్రి తనకు సర్టిఫికేట్ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఎడమ మోకాలికి ఆ గాయమైంది. అందుకే దివ్యాంగ కేటగిరీలో తాను చేసిన అటెంప్ట్స్ గురించి మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని ఆమె కోర్టుకు తెలిపారు. తనకు 47 శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికేట్‌లో పూజా తెలిపారు. నిజానికి ఆ కేటగిరీలో 40 శాతం వైకల్యం ఉన్నా.. పరీక్షకు అర్హురాలే. జనరల్ కేటగిరీ విద్యార్థిగా తాను ఏడు సార్లు సివిల్స్ పరీక్ష రాశానని, అయితే ఆ అటెంప్ట్స్ ను పరిగణలోకి తీసుకోరాదు అని ఆమె తన



అఫిడవిట్‌లో తెలిపారు. ఒకవేళ తన రిక్వెస్ట్‌ను ఆమోదిస్తే, తాను చేసిన ప్రయత్నాల సంఖ్య అయిదుకు తగ్గుతుందని ఆమె చెప్పారు. అలా చేస్తే అప్పుడు మరో నాలుగు ప్రయత్నాలు చేసే అవకాశం తనకు ఉంటుందని పూజా ఖేద్కర్ తెలిపారు. యూపీఎస్సీ విధించిన అనర్హత వేటును ప్రశ్నిస్తూ.. తనపై చర్యలు తీసుకునే అధికారం యూపీఎస్సీకి లేదన్నారు. సివిల్స్ పరీక్షను విజయవంతంగా క్లియర్ చేసేందుకు తాను ఎటువంటి చీటింగ్‌కు పాల్పడలేదని ఆమె మరో అఫిడవిట్‌లో కోర్టుకు తెలిపారు.

# పేదలకు గూడు లేకుండా చేస్తున్నారు

- రాష్ట్రాన్ని మరో బుల్డోజర్ రాజ్యంగా మార్చొద్దు
- పేదల జీవితాలను ఆగం చేస్తున్న కాంగ్రెస్
- మల్లిఖార్జున ఖర్గేకు కేటీఆర్ విజ్ఞప్తి







ముందడుగు తెలంగాణ:
తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరో బుల్డోజర్ రాజ్యంగా మార్చే ప్రయత్నం చేస్తోందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం, చట్టం ఉల్లంఘిస్తూ పేదలకు గూడు లేకుండా చేసే ప్రయత్నాన్ని మీరు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఒకరి ఇంటిని కూల్చివేసి వారి కుటుంబాన్ని నిరాశ్రయులుగా మార్చటం అమానవీయం, అన్యాయం అని గతంలో మీరే అన్నారని ప్రస్తావించారు.

కాంగ్రెస్ అధినేత ఖర్గే మాటలను గుర్తు చేస్తూ ప్రశ్నించిన కేటీఆర్.. చట్టాన్ని ఉల్లంఘిస్తూ పేదల జీవితాలను ఆగం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు తెలంగాణలో కూడా పేదల ఇళ్లను అదే విధంగా కూల్చేస్తూ ఆ కుటుంబాలను నిరాశ్రయులు చేస్తున్నారని ఆక్షేపించారు. దీనికి మీ సమాధానం ఏమిటి?అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని 75 మంది పేదల ఇళ్లను తెల్లవారుజామున 3 గంటలకు ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేసిన ఘటనను 'ఎక్స్' వేదికగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మీ ప్రభుత్వం కూల్చేసిన 75 కుటుంబాల ఇళ్లలో 25 కుటుంబాలు వికలాంగులకు చెందినవేనని తెలిపారు. 40 ఏళ్ల కిందట, 20 ఏళ్ల క్రితం ఇళ్లు కట్టుకొని నివాసం ఉన్న పేదల ఇళ్లను ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చేస్తుండటం ఎంత అమానవీయమో ఖర్గే చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రం మరో బుల్డోజర్ రాజ్యం కాకుండా మీ పార్టీ ప్రభుత్వానికి సూచన చేయలంటూ ఖర్గేకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

ముందడుగు
శనివారం, 31-08-2024, హైదరాబాద్



# నా చిత్రానికి సెన్సార్ రావడం లేదు

## అనుకున్న సమయానికి విడుదల చేస్తా

### ఎమర్జెన్సీ చిత్రంపై కంగనా రనౌత్

ముందడుగు జాతీయం:

బాలీవుడ్ నటి కంగనా రనౌత్ నటించిన చిత్రం 'ఎమర్జెన్సీ' వచ్చే నెలలో విడుదల చేయనున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. తమ చిత్రానికి సెన్సార్ బోర్డ్ ఇంకా సర్టిఫికేట్ ఇవ్వలేదని కంగన తాజాగా తెలిపారు. త్వరలోనే మా సినిమా సెన్సార్ పూర్తి అవుతుందని ఆశిస్తున్నా. మేం సర్టిఫికేట్ కోసం వెళ్లిన రోజు కొంత మంది డ్రామా క్రియేట్ చేశారు. సెన్సార్ బోర్డులోనూ చాలా సమస్యలు ఉన్నాయి. అనుకున్న సమయానికి మా సినిమా విడుదల కావాలని కోరుకుంటున్నా. సెన్సార్ సర్టిఫికేట్ విషయంలో చాలా నమ్మకంగా ఉన్నా. వాళ్లు సర్టిఫికేట్ ఇవ్వడం లేదు. నా సినిమా కోసం నేను పోరాటం చేయడానికి సిద్ధం. ఇందు కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా" అని కంగన తెలిపారు. ఈ సినిమా విషయంలో చిత్రబృందానికి వస్తోన్న బెదిరింపులను ఉద్దేశించి ఆమె కామెంట్ చేశారు. "మమ్మల్ని బెదిరించినంత మాత్రాన చరిత్ర ఏమీ మారిపోదు" అని అన్నారు.

# రజనీకాంత్ 'కూలీ'లో శృతి హాసన్..




సూపర్ స్టార్ రజనీకాంత్, తమిళ అగ్ర దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం 'కూలీ'. సన్‌పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధిమారన్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. తలైవ కెరీర్‌లో ఇది 171వ సినిమా. సౌత్ ఇండియన్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ మూవీ నుంచి ఒక్కొక్క పాత్రను మేకర్స్ రివీల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మలయాళ నటుడు, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్ కీలక పాత్రలో నటించబోతున్నట్లు ప్రకటించిన చిత్రబృందం గురువారం అక్కినేని నాగార్జున సైమన్ అనే పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు మరో పాత్రను రివీల్ చేశారు. ఈ సినిమాలో తమిళ నటి శృతి హాసన్ ప్రీతి అనే పాత్రలో నటిస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ప్రీతి ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది.

# చరిత్ర సృష్టించిన అవనీ లేఖరా

## పారిస్ పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకం

ముందడుగు జాతీయం:

పారాలింపిక్స్ 2024లో భారత్ పతకాల వేటను ఆరంభించింది. దివ్యాంగుల విశ్వక్రీడల్లో భారత షూటర్ అవనీ లేఖరా స్వర్ణ పతకంతో మెరిసింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో అవనీ అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. 249.7 పాయింట్లతో సమీప ప్రత్యర్థి లీ (సౌత్ కొరియా)పై విజయాన్ని అందుకుంది. ఫలితంగా గోల్డ్ మెడల్ ను సాధించింది. 246.8 పాయింట్లతో లీ రెండో స్థానంలో నిలిచి సిల్వర్ పతకాన్ని సాధించింది. మూడో స్థానంలో మోనా అగర్వాల్ (భారత్) నిలిచి కాంస్య పతకాన్ని అందుకుంది. ఫలితంగా 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ లో భారత్ కు రెండు పతకాలు సొంతం అయ్యాయి.

పారిస్ పారాలింపిక్స్ లో పతకం సాధించడం ద్వారా అవనీ లేఖరా సరికొత్త చరిత్రను లిఖించింది. టోక్యో వేదికగా జరిగిన 2020 పారాలింపిక్స్ లో కూడా అవనీ బంగారు పతకంతో మెరిసింది. ఇప్పుడు మరోసారి స్వర్ణ పతకాన్ని సాధించింది. ఫలితంగా పారాలింపిక్స్ లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన తొలి భారతీయురాలిగా అవనీ కొత్త చరిత్రను లిఖించింది. కొన్ని రోజుల క్రితం ముగిసిన పారాలింపిక్స్ లో భారత్ ఒక్క గోల్డ్ మెడల్ సాధించకుండానే ఇంటి దారి పట్టింది. అయితే పారాలింపిక్స్ లో మాత్రం భారత్ కు మూడో రోజే బంగారు పతకం ఖాయమైంది. దాంతో పాటు మరో కాంస్య పతకం కూడా. ప్రస్తుతం భారత్ 2 పతకాలతో మెడల్ టేబుల్ లో 9వ స్థానంలో కొనసాగుతుంది.



# నైట్ డ్యూటీ సురక్షితం కాదు

## వెనకడుగు వేస్తున్న మహిళా డాక్టర్లు

### నైట్ షిఫ్టుల్లో డ్యూటీ రూమ్ లేదు


### ఐఎంఎ ఆన్‌లైన్ సర్వేలో వెల్లడి

ముందడుగు జాతీయం:

పశ్చిమబెంగాల్ కోల్‌కతా వైద్య విద్యార్థిని అత్యాచార ఘటనతో రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించేందుకు కొందరు వైద్యులు భయపడుతున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా మహిళా డాక్టర్లు ఇందుకు వెనకడుగు వేస్తున్నారని తేలింది. ఆత్మరక్షణ కోసం విధులకు వచ్చేటప్పుడు ఆయుధాలను వెంట తెచ్చుకోవాలని భావిస్తున్నారని కొందరు మహిళా డాక్టర్లు చెప్తున్నారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో ఇటీవల చోటుచేసుకున్న వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో వైద్యుల భద్రతకు సంబంధించిన సమస్యలను అంచనా వేసేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇటీవల ఓ ఆన్‌లైన్ సర్వే నిర్వహించింది. ఇందులో 22 రాష్ట్రాలకు చెందిన 3885 మంది ప్రభుత్వ/ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు. వీరిలో 85శాతం మంది 35ఏళ్లలోపు వారే. 61శాతం మంది ఇంటర్న్లు లేదా పీజీ వైద్యవిద్యార్థులే. సర్వేలో వారు వెల్లడించిన విషయాలు..

**భయపడుతున్న వైద్య విద్యార్థులు**

సర్వేలో పాల్గొన్న వైద్యుల్లో 24.1శాతం మంది నైట్ డ్యూటీలో సురక్షితంగా భావించడం లేదని మరో 11.4శాతం మంది అత్యంత ఆందోళన వ్యక్తంచేసినట్లు తేలింది. ఇలా భయపడుతోన్న వారిలో అత్యధికులు మహిళా వైద్యులు, వైద్య విద్యార్థినులే ఉన్నారు. నైట్ షిఫ్టుల్లో డ్యూటీ రూమ్ లేదని సర్వేలో పాల్గొన్న 45శాతం మంది పేర్కొన్నారు. డ్యూటీ రూమ్‌లు ఉన్నవారు మాత్రం అత్యంత సురక్షితంగా ఉన్నట్లు చెప్పారు. డ్యూటీ రూమ్‌లు ఉన్నచోట అవి సరిపోవడం లేదని, గోప్యత లేకపోవడం, తాళాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ ప్రదేశాలను ఎంచుకోవాల్సి వస్తుందని చాలామంది అభిప్రాయం. అందుబాటులో ఉన్న మూడింట ఒకవంతు డ్యూటీ రూమ్‌లలో అటాచ్డ్ బాత్‌రూమ్‌లు లేవని తేలింది. వాటికోసం చాలాదూరం వెళ్లాల్సి వస్తోందని తెలిసింది. సగానికిపైగా (53శాతం) డ్యూటీ రూమ్‌లు.. వార్డులు/అత్యవసర చికిత్సా విభాగాలకు చాలా దూరంలో ఉన్నాయని అధ్యయనంలో వెల్లడైంది.



ముందడుగు
శనివారం, 31-08-2024, హైదరాబాద్

## మోటార్ పాలసీలలో పీబీ పార్ట్‌నర్స్ 73% వాటాతో గణనీయమైన వృద్ధి



ముందడుగు హైదరాబాద్:
పాలసీబజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్ల ఆధ్వర్యంలోని బ్రాండ్ పీబీ పార్ట్‌నర్స్, తన విలక్షణమైన పాయింట్స్ ఆఫ్ సేల్ పర్సన్ మోడల్‌తో బీమా పరిశ్రమలో కొత్త కొలమానాలను, మైలురాళ్లను నెలకొల్పుతోంది. కంపెనీ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ మరియు ఆంధ్ర ప్రదేశ్‌లలో తాజా మోటారు బీమా కొనుగోలు పోకడలను, ఈ విభాగంలో సాధించిన అద్భుతమైన వృద్ధిని ప్రత్యేకంగా వివరించింది. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్, సేల్స్ హెడ్, మోటార్ బిజినెస్ అమిత్ భదోరియాతో పాటు పీబీ పార్ట్‌నర్స్ నుంచి ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

“హైదరాబాద్ ప్రజలలో పెరిగిన అవగాహన పే యాజ్ యు డ్రైవ్ వంటి మాడ్యులర్ బీమా ప్లాన్‌ల కొనుగోలులో గణనీయమైన పుంజుకోవడానికి దారితీసింది. దక్షిణాదిలో, ముఖ్యంగా తెలంగాణ మరియు హైదరాబాద్‌లో మా ఉనికిని విస్తరించేందుకు మేము కట్టుబడి ఉన్నాము. పీబీ పార్ట్‌నర్స్ ప్రతిచోటా అందుబాటులో ఉండేలా చూసుకోవడం ద్వారా అత్యంత మారుమూల గ్రామాలకు కూడా చేరుకోవడమే మా లక్ష్యం. అలాగే, 2027-28 నాటికి, వైజాగ్, తిరుపతి, కోయంబత్తూర్ మరియు ఇతర నగరాలతో సహా దక్షిణ భారతదేశంలో దాదాపు 17-18 కార్యాలయాలను ఏర్పాటు చేయాలని మేము ప్రణాళికను రూపొందించుకున్నాము. ఆంధ్ర మరియు తెలంగాణ ఏజెంట్ భాగస్వాముల కోసం మా కొత్త కాల్ సెంటర్‌తో, రాబోయే సంవత్సరంలో విక్రయించే మోటారు బీమా పాలసీలలో ఘనమైన వృద్ధిని మేము అంచనా వేస్తున్నాము. అక్టోబర్ నెలాఖరులోగా మా హైదరాబాద్ కార్యాలయాన్ని ప్రారంభిస్తాము” అని పీబీ పార్ట్‌నర్స్ మోటార్ ఇన్సూరెన్స్ అసోసియేట్ డైరెక్టర్ మరియు సేల్స్ హెడ్ అమిత్ భదోరియా వివరించారు.

## బొండా తెగలో మొట్టమొదటి డాక్టర్

- నీట్ పరీక్షలో అర్హత సాధించిన ముదులి
- ఆ తెగ నుంచి డాక్టర్ కాబోతున్న మొదటి వ్యక్తి





ముందడుగు ఒడిశా:
మారుమూల అటవీ ప్రాంతంలో పుట్టి, పెరిగి ఎన్నో సమస్యలను ఎదుర్కొన్న ఓ ఆదివాసీ కుర్రాడు ధైర్యంగా ముందడుగు వేశాడు. ఎంతో కష్టతరమైన నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పరీక్షలో అర్హత సాధించి, మంచి కాలేజీలో సీటు సాధించాడు. ఒడిశాలోని బోండా తెగకు చెందిన మంగళ ముదులి(19) ప్రతిష్ఠాత్మకమైన మెడికల్ ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. బెర్హంపూర్‌లోని మహారాజ కృష్ణచంద్ర గజపతి మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొందాడు. అంతేకాదు ఆ తెగ నుంచి డాక్టర్ కాబోతున్న మొదటి వ్యక్తిగా నిలిచాడు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖ ఎక్స్ ఖాతా వేదికగా పేర్కొంది.

### రోజు ఐదు కిలోమీటర్లు ట్రెక్కింగ్

స్థానిక మీడియా తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ ముదులి కుటుంబం చిన్నతరహా అటవీ ఉత్పత్తులను అమ్ముకుంటూ జీవిస్తోంది. అతడికి ముగ్గురు తోబుట్టువులు. వారి కుటుంబంలో మొదట ఉన్నత విద్యను అభ్యసించింది తానే అని ముదులి పేర్కొన్నాడు. స్థానిక రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేశానని, రోజూ ఐదు కిలోమీటర్ల దూరం ట్రెక్కింగ్ చేస్తూ ఆ స్కూల్‌కు వెళ్లేవాడినని వివరించాడు. అనంతరం ఇంటర్ చదవడానికి తమ గ్రామం నుంచి 25 కి.మీ. వెళ్తూ, ఏకకాలంలో నీట్ కోచింగ్ తీసుకునేవాడినని తెలిపాడు. కోచింగ్ కోసం అతడి స్కూల్ టీచర్ ఆర్థికసాయం చేశారని తెలిపాడు. తమ గూడెంలోని ప్రజలకు సరైన వైద్య సదుపాయాలు అందకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజలు సొంతంగా మూలికా వైద్యం చేసుకోవడంతో ఒక్కోసారి అది వికటించి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడం కోసం తాను డాక్టర్‌ను కావాలనుకుంటున్నానని మీడియాకు తెలిపాడు.

## లేడీస్ హాస్టల్‌లో సీక్రెట్ కెమెరాలు



ముందడుగు ఆంధ్రప్రదేశ్:
ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలోని గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ లేడీస్ హాస్టల్‌లో సీక్రెట్ కెమెరాల వ్యవహారం ఆ రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. అదే కళాశాలకు చెందిన ఫైనలియర్ విద్యార్థి, హాస్టల్‌కు చెందిన ఓ విద్యార్థిని ద్వారా అమర్చిన ఆ సీక్రెట్ కెమెరాల్లో విద్యార్థినుల వీడియోలను రికార్డు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. సుమారు 300 ఫొటోలు, వీడియోలను విద్యార్థులకు, ఇతరులకు అమ్మినట్టు ఆరోపణలు ఉన్నాయి. కాలేజీలో జరిగిన ఈ ఘటనపై విద్యార్థినులు గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు కళాశాల ఆవరణలో ఆందోళనకు దిగారు.

పలువురు స్థానికులు కూడా వారికి మద్దతుగా నిలిచారు. వారం క్రితమే వాష్‌రూమ్‌లో రహస్య కెమెరాను గుర్తించి యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఈ సందర్భంగా విద్యార్థినులు మండిపడ్డారు. ఇదే హాస్టల్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని తన బాయ్‌ఫ్రెండ్ సూచనతో ఈ రహస్య కెమెరాలను అమర్చారని, వీడియోలు, ఫొటోలను ఇతరులకు అమ్ముకుంటున్నారని విద్యార్థినులు ధ్వజమెత్తారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడి చేయబోతుండగా, పోలీసులు అక్కడికి చేరుకొని వారించారు. రహస్య కెమెరా అమర్చిన సీనియర్ విద్యార్థి, బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న విజయ్‌కుమార్‌ను ఈ సందర్భంగా పోలీసులు అరెస్టు చేసి, అతని లాప్‌టాప్‌ను సీజ్ చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఓ విద్యార్థినిని బ్లాక్‌మెయిల్ చేసి ఆమె ద్వారా వాష్‌రూమ్‌లలో హిడెన్ కెమెరాలను అమర్చినట్టు విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. ఆ కెమెరాల్లో రికార్డయిన 300 ఫొటోలు, వీడియోలను నిందితుడు విజయ్‌కుమార్ ఇతరులకు అమ్మినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మహిళల వాష్‌రూమ్‌లో కెమెరాలను అమర్చిన విద్యార్థిని ఎవరు? రికార్డయిన ఫొటోలు, వీడియోలను ఎవరెవరికి షేర్ అయ్యాయన్న విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పందించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. ఘటన నేపథ్యంలో గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీకి యాజమాన్యం సెలవులు ప్రకటించింది.

## రూటు మార్చిన రష్మిక మందన్నా.. ఈ సారి హార్రర్ సినిమా



చాలా కాలంగా సరైన హిట్స్ లేని బాలీవుడ్ ఇండస్ట్రీకి మంచి రోజులొచ్చాయి. అజయ్ దేవ్‌గన్ నటించిన సైతాన్ సినిమాతో మంచి హిట్టందుకున్నాడు. జూన్‌లో విడుదలైన Munjya సినిమా కూడా సూపర్ హిట్‌గా నిలిచింది. ఇటీవలే విడుదలైన స్త్రీ 2 ఏకంగా రికార్డుల పరంపర కొనసాగిస్తోంది. ఈ రికార్డులను బద్దలు కొట్టేందుకు నేను కూడా రెడీ అంటోంది కన్నడ సోయగం రష్మిక మందన్నా. ఇప్పటిదాకా గ్లామరస్ రోల్స్‌లో మెరిసిన రష్మిక మందన్నా ఇక అందరినీ భయపెట్టిస్తానంటోంది. రష్మిక హిందీ సినిమాకు సైన్ చేసింది. ఈ మూవీకి Vampired of Vijayanagara టైటిల్‌ను ఫిక్స్ చేశారు. Munjya ఫేం ఆదిత్య సర్పొట్‌దర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ చిత్రంలో ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటిస్తున్నాడు. తాజా సమాచారం ప్రకారం రెండు టైమ్ లైన్స్ ఆధారంగా సినిమా ఉండబోతుందట. వీటిలో ఒకటి విజయ నగర సామ్రాజ్యంలోని హంపి సిటీ కాగా.. రెండోది నార్తిండియాలోని ఓ చిన్న కుగ్రామం. ఇందులో రష్మిక డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపించబోతున్నట్టు బీటౌన్ సర్కిల్ టాక్. ప్రస్తుతం తెలుగు, తమిళం, హిందీలో వరుస సినిమాలు చేస్తోంది.

ముందడుగు
శనివారం, 31-08-2024, హైదరాబాద్



# టీలో కల్తీని గుర్తించటం ఎలా


## ప్రతి వినియోగదారుడు తెలుసుకోవలసిన అంశాలు

ముందడుగు హైదరాబాద్:

ఒక పానీయం కంటే ఎక్కువ, టీ ; మన చరిత్రలో అంతర్భాగంగా కలిసిపోయిన ఆచారం మాత్రమే కాదు ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందికి ఉపశమన మూలం. అయినప్పటికీ, మనం , మన కప్పల నుండి టీ రుచులను ఆస్వాదిస్తున్నప్పుడు కూడా , మనం తీసుకునే టీ యొక్క స్వచ్ఛత మరియు ప్రామాణికతను తరచుగా విస్మరిస్తుంటాము. ప్యాకెజీ లలో కాకుండా విడిగా విక్రయిస్తున్న టీ పొడి లో కల్తీ సమస్య ఒక ముఖ్యమైన ఆందోళనగా ఉద్భవించింది, ఎక్కువ మందికి ప్రీతి పాత్రమైన ఈ పానీయపు నాణ్యతను దెబ్బతీసే ప్రమాదం ఉంది. కల్తీతో సంబంధం ఉన్న నష్టాలను అర్థం చేసుకోవడం మరియు ప్యాకెట్ లలో కాకుండా విడిగా విక్రయించినప్పటికీ అసలైన టీని ఎలా గుర్తించాలో తెలుసుకోవడం అనేది ప్రామాణికమైన మరియు సురక్షితమైన టీ అనుభవాన్ని నిర్ధారించడానికి కీలకమైనది.

### టీలో కల్తీని అర్థం చేసుకోవడం

టీలో కల్తీ అనేది తేయాకులకు హానికరమైన పదార్థాలను చేర్చడం తో మొదలవుతుంది, తరచుగా రంగు లేదా రుచికి సంబంధించి టీ రూపాన్ని పెంచే ఉద్దేశ్యంతోనే ఇది జరుగుతుంటుంది. ఈ మోసపూరిత పద్ధతిలలో అనధికారిక రంగులు, రుచులు లేదా ఇతర మొక్కల పదార్థాలను ఉపయోగించడం కూడా ఉండవచ్చు, దీనివల్ల కంటికి లేదా ముక్కుకు మరింత ఆకర్షణీయంగా టీ అనిపించవచ్చు. అయినప్పటికీ, ఈ పదార్థాల జోడింపులు టీ యొక్క స్వచ్ఛతను తగ్గించటమే కాకుండా ముఖ్యమైన ఆరోగ్య ప్రమాదాలను కూడా కలిగిస్తాయి. ఉదాహరణకు, కార్మైన్, బ్రిలియంట్ బ్లూ, సన్ సెట్ యెల్లో మరియు టార్ట్రాజైన్ వంటి సింథటిక్ రంగులు పాడైపోయిన లేదా తక్కువ నాణ్యత గల టీ ఆకులకు వాటి రూపాన్ని మెరుగుపరచడానికి కొన్నిసార్లు జోడించబడతాయి. అయితే, ఈ పదార్థాలను జోడించడానికి చట్టాలు అనుమతించవు , వీటిని వినియోగించటం హానికరం.




# ఏటిఎం కార్డులు అవసరం లేదు

## నవ్వితే డబ్బులు వస్తాయి..! ▪ స్మైల్‌పే అనే ఒక కొత్త పేమెంట్ మెథడ్ కస్టమర్ ముఖాన్ని చూసి పేమెంట్ పూర్తి చేస్తోంది

ముందడుగు ప్రత్యేకం:

బ్యాంకింగ్ రంగం అంతా డిజిటల్ మయంగా మారింది. సింపుల్ క్లిక్‌తో భారీ ట్రాన్సాక్షన్లు కూడా పూర్తి చేయగలుగుతున్నాం. అయితే కొన్ని బ్యాంకులు ఇంతకంటే మరింత సులభమైన పేమెంట్ మెథడ్స్ తీసుకొస్తూ ఆశ్చర్యపరుస్తున్నాయి. తాజాగా ప్రముఖ ప్రైవేట్ రంగ ఫెడరల్ బ్యాంక్ స్మైల్‌పే అనే ఒక కొత్త రకం పేమెంట్ మెథడ్ తీసుకొచ్చింది. దీంతో పేమెంట్స్ చేయాలంటే కార్డులు లేదా ఫోన్లు అవసరం లేదు. ఈ సర్వీస్ కస్టమర్ ముఖాన్ని చూసి, గుర్తించి, పేమెంట్ పూర్తి చేస్తుంది. అంటే, కస్టమర్ నవ్వుతూ కెమెరా ముందు నిలబడితే చాలు, డబ్బు చెల్లించవచ్చు.

### స్మైల్‌పే ప్రత్యేకతలు

ఫెడరల్ బ్యాంక్ 2024, ఆగస్టు 29న స్మైల్‌పై సేవలను ప్రారంభించింది. ఇది భారతదేశంలోనే మొదటి ఫేషియల్ రికగ్నిషన్ పేమెంట్ సిస్టమ్. UIDAIకి చెందిన భీమ్ ఆధార్‌పే ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ఆధారంగా ఇది పనిచేస్తుంది. ఇప్పుడు కేవలం ఫేస్‌ను స్కాన్ చేస్తే చాలు, పేమెంట్ జరిగిపోతుంది. ఈ ప్రాసెస్ చాలా సులభం. కేవలం రెండు స్టెప్స్‌లో ట్రాన్సాక్షన్లు కంప్లీట్ అవుతాయి. "మనం డబ్బు, కార్డులు, క్యూఆర్ కోడ్స్, వేరే డివైజ్‌లతో పేమెంట్స్ చేసేవాళ్లం. ఇప్పుడు కేవలం నవ్వుతూ ఉంటే చాలు డబ్బు చెల్లించవచ్చు. ఇది కస్టమర్లకు చాలా ఆసక్తికరమైన అనుభవం" అని ఫెడరల్ బ్యాంక్ సిడిఓ ఇంద్రనీల్ పండిట్ చెప్పారు.

### ఫీచర్స్, బెనిఫిట్స్

ఫెడరల్ బ్యాంక్ తీసుకొచ్చిన స్మైల్‌పే చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. డబ్బు, కార్డులు లేదా ఫోన్లు అవసరం లేదు. కేవలం ఫేస్ చూపిస్తే చాలు. దీంతో వ్యాపారులు త్వరగా డబ్బు వసూలు చేయొచ్చు. ఇది UIDAI ఫేస్ అథెంటికేషన్ టెక్నాలజీని యూజ్ చేస్తుంది. చిన్న మిస్టేక్ కూడా జరగకుండా ట్రాన్సాక్షన్లను పూర్తి చేస్తుంది.

### అవైలబిలిటీ, ఫ్యూచర్ ఎక్స్‌పాన్షన్

స్మైల్‌పే సర్వీస్, మొదట ఫెడరల్ బ్యాంక్‌లో అకౌంట్ ఉన్న వాళ్లకే లభిస్తుంది. అంటే, షాపు యజమాని కూడా, షాపింగ్ చేసే వాళ్లు కూడా ఫెడరల్ బ్యాంక్‌లో అకౌంట్ ఉండాలి. కానీ, బ్యాంక్ త్వరలోనే ఇంకా ఎక్కువ మందికి ఈ సర్వీసు అందించాలని, ఇతర కంపెనీలతో కలిసి పని చేయాలని అనుకుంటుంది. ఇప్పటికే రిలయన్స్ రిటైల్, "స్వతంత్ర మైక్రో ఫైనాన్స్" కంపెనీలతో కలిసి కొన్ని చోట్ల ఈ పద్ధతిని ప్రయోగించారు.

### పేమెంట్స్ చేసే ప్రాసెస్

ఫెడరల్ బ్యాంక్‌లో అకౌంట్ ఉండి ఫెడ్ మెర్చంట్ యాప్‌ని ఉపయోగిస్తున్న వ్యాపారుల వద్ద ఈ స్మైల్ పే పేమెంట్ మెథడ్ ఉపయోగించవచ్చు. ఏదైనా సరుకులు కొన్నప్పుడు, వ్యాపారి కస్టమర్ ఆధార్ కార్డు నంబర్‌ని ఆ యాప్‌లో ఎంటర్ చేస్తారు. ఆ తర్వాత ఫేస్ కెమెరాతో స్కాన్ చేస్తారు. అదే వ్యక్తి అని కన్ఫర్మ్ అయ్యాక కస్టమర్ బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బు కట్ అయి వ్యాపారి ఖాతాలో జమ అవుతుంది. ఈ ప్రాసెస్ చాలా వేగంగా జరుగుతుంది. ఆ తర్వాత యాప్‌లో ఒక నోటిఫికేషన్ వస్తుంది. తద్వారా మర్చంట్ కన్ఫామ్ చేసుకోవచ్చు. అయితే స్మైల్ పే ద్వారా సింగిల్ పేమెంట్‌లో గరిష్ఠంగా రూ.5,000 మాత్రమే పంపించగలరు. ఒక నెలలో మొత్తం స్మైల్ పే ద్వారా 50,000 రూపాయలకు మించి పంపించలేరు.